
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 30 జూన్ 2025




మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ఈవో శీనా నాయక్‌కు బంగారు బోనం అందజేస్తున్న భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల కమిటీ

# నిర్లక్ష్యపు జాడ్యం!

## జిల్లా పరిషత్‌లో అస్తవ్యస్తంగా పాలన

### బదిలీపై ఆరు నెలల కాలంలో 10 మంది జూనియర్ అసిస్టెంట్ల రాక

- నేటి వరకు కేటాయించని విధులు, బాధ్యతలు!
- కార్యాలయానికి వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్తున్న ఉద్యోగులు
- పెండింగ్‌లో డీడీవోల జీపీఎఫ్, ఎంపీడీవోల సర్వీస్‌మేటర్, ఉద్యోగుల పీఎఫ్ ఫైళ్లు
- జెడ్పీలో అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు







జెడ్పీ కార్యాలయం

జిల్లా పరిషత్ కార్యాలయానికి నిర్లక్ష్యపు జాడ్యం పట్టుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఆరు నెలల కాలంలో పది మంది వరకు జూనియర్ అసిస్టెంట్లు బదిలీపై వస్తే నేటి వరకు వారికి సీట్లు కేటాయించకపోవడంతో రోజూ వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్తున్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన డీడీవోల జీపీఎఫ్, ఎంపీడీవోల సర్వీస్‌మేటర్, ఉద్యోగుల పీఎఫ్ తదితర ఫైళ్లు సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం: జిల్లా పరిషత్‌కు ఆరు నెలలు, మూడు నెలలు, గత 20 రోజుల వ్యవధిలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులు 10 మందికిపైగా బదిలీపై వచ్చారు. వీరికి ఇంత వరకు ఎక్కడ పనిచేయాలో చెప్పకుండా, జెడ్పీలోని వివిధ విభాగాలకు కేటాయించకుండా అధికారులు వదిలేశారు. దీంతో బదిలీపై వచ్చిన ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏదైనా అత్యవసరమైన పని ఉంటే వీరిని కొన్ని సెక్షన్‌లలో ఒకటీ రెండు రోజులు వాడుకుని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో పదిమందికిపైగా ఉద్యోగులు కార్యాలయానికి వచ్చి మిగతా 6లో..

### సూపరింటెండెంట్ల పదోన్నతుల వేళ జాప్యమే!

మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే సూపరింటెండెంట్లకు పదోన్నతులు ఇచ్చే సమయంలో గత రెండు, మూడు సంవత్సరాలుగా వారి పనితీరు, ఎదుర్కొన్న ఆరోపణలు, అవినీతి అంశాలు, ఏసీబీ కేసులు తదితర వివరాలు గుట్టుచప్పుడు కాకుండా తెలుసుకుని ఉన్నతాధికారులకు అన్ని ఆధారాలతో నివేదికలు పంపాలి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల జెడ్పీ కార్యాలయాల నుంచి ఈ నివేదికలు ముందస్తుగానే పంపగా, కృష్ణాజిల్లా నుంచి మాత్రం ఆలస్యంగా పంపారని జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. జిల్లా పరిషత్‌లో పరిపాలన సజావుగా సాగేందుకు ఖాళీగా ఉంటున్న ఉద్యోగులకు సీట్లు కేటాయించి, వారితో పనిచేయిస్తేనే పరిపాలన కొంతమేర అయినా గాడిలో పడుతుందని, జిల్లాస్థాయి అధికారులు ఈ అంశంపై దృష్టిసారించాలని జెడ్పీ ఉద్యోగులు కోరుతున్నారు.

# బంగారు బోనం

## కనకదుర్గమ్మకు సమర్పించిన భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల కమిటీ

- జమ్మిదొడ్డి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా కొండకు..
- బంగారు బోనాన్ని స్వీకరించి అమ్మకు సమర్పించిన దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి





జమ్మిదొడ్డి నుంచి భారీ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి బంగారు బోనంతో వెళ్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ భాగ్యనగర్ మహంకాళీ జాతర ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆదివారం మేళతాళాలతో అంగరంగ వైభవంగా తరలివచ్చి బంగారు బోనం మిగతా 6లో..



## ● పుష్ప సోయగం

స్వచ్ఛ సుందర చల్లపల్లిలో పుష్ప సోయగం ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తోంది. పద్మావతి హాస్పటల్ బజారు, గంగులవారిపాలెం రోడ్డు, హైవే రోడ్లు వివిధ వర్ణాల పూలతో కనువిందు చేస్తున్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణం ఆనందభరితమైంది.

-ఆంధ్రజ్యోతి - చల్లపల్లి



పద్మావతి హాస్పటల్ రోడ్డులో కనువిందు చేస్తున్న పూల మొక్కలు



పూల మొక్కలతో ఆహ్లాదకరంగా చల్లపల్లి-గంగులవారిపాలెం రోడ్డు



సువర్ణ గన్నేరు మొక్కలతో చల్లపల్లి హైవే



గంగులవారిపాలెం రోడ్డులో ఎర్ర తురాయి, పచ్చతురాయి పుష్పాలు

### రాజధానిలో పనుల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు బృందం రాక

- నేడు సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం 6

### డాక్టర్ అశ్వనీకుమార్‌కు ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం అవార్డు

# సెలవు రోజు గుట్టుగా..

## బుసక మాఫియా బరితెగింపు

- శనివారం రాత్రి నుంచి బుసక, ఇసుక తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు.. విమర్శలు గుప్పిస్తున్న స్థానికులు



పొట్టిదిబ్బలంకలో శనివారం రాత్రి నుంచి బుసక తవ్వకాలు జరిపిన పొలం



పొట్టిదిబ్బలంకలో బుసక లోడింగ్

తోట్లవల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆదివారం అధికారులకు సెలవు అయితే మాకు మాత్రం పండగ అన్నట్టుగా బుసక మాఫియా తయారయింది. దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంకలో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు బుసక తవ్వకాలు జరిగాయి. బుసక తవ్వకాలు పూర్తి కావటంతో పక్కనే కళ్లంవారిపాలెంలో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. గ్రామస్థుల సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మీడియా వెళ్లగా పొట్టిదిబ్బలంకలో రహదారి పక్కన మిగతా 6లో..

### నాడు చర్యలు తీసుకోకుండా వదిలేశారు..

మే 15వ తేదీన పొట్టిదిబ్బలంకలో బుసక తవ్వకాలు చేపట్టాగా 'ఆంధ్రజ్యోతి' బుసక మాఫియాపై కథనం ప్రచురించింది. అదేరోజు వీఆర్వో నాగేశ్వరరావు వచ్చి మీడియా ఎదుటే బుసక లారీలను పట్టుకున్నారు. ఆ తర్వాత ఒత్తిళ్లకు తలొగ్గి ఆ బుసక లారీలను ఎలాంటి జరిమానా లేకుండా విడిచి పెట్టారు. అప్పటి నుంచి నిలిపిన బుసక తవ్వకాలను శనివారం రాత్రి చేపట్టి ఆదివారం మధ్యాహ్నానికి పూర్తి చేసేశారు. ఇదంతా అధికారుల మొతక తనంతోనే జరిగినట్టు తెలుస్తోంది. మేలో జరిపిన బుసక తవ్వకాల వైపు ఒక్క అధికారి కూడా పరిశీలించకుండా చర్యలు లేకుండా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఇపుడు అదే పొలంలో బుసక తవ్వకాలు జరపటానికి మాఫియాకు అలుసు దొరికింది. అధికారులు, మాఫియా కుమ్మక్కు చర్యల్లో భాగంగానే ఇలా బరితెగింపునకు సాహసిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు సైతం మాఫియాపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవటం విమర్శలకు తావిస్తోంది.

# ఇక వేగంగా..

## బీవోటీ విధానంలో ఇన్నర్ రింగ్ రోడ్డు!

### రంగం సిద్ధం చేసిన సీఆర్‌డీఏ

### ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ సమీకరణ

- అవసరమైన భూములు 1,155.41 ఎకరాలు
- ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం, జీ కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లో..
- కృష్ణాజిల్లాలో గన్నవరం, పెనమలూరు మండలాల్లో భూ సమీకరణ!
- గ్రామ సభలు నిర్వహించేందుకు సన్నద్ధం
- పూర్తికాగానే పక్షం రోజుల్లో టెండర్ల ప్రక్రియ

“ అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అడుగులు ముందుకు వేస్తోంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో రోడ్డును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో అవసరమైన 1,155.41 ఎకరాల భూములు సమీకరించేందుకు త్వరలో గ్రామ సభలు నిర్వహించనుంది. అవి పూర్తయిన పక్షం రోజుల్లోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనుంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) పనులకు సీఆర్‌డీఏ రంగం సిద్ధం చేస్తోంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించేందుకు సిద్ధమవుతోంది. మూడు నెలల్లోపే దీనికి సంబంధించిన టెండర్లు పిలవనుంది. అమరావతి రెండో దశ భూ సమీకరణలో భాగంగా ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆటోమేటిక్‌గా భూ సమీకరణ జరిగిపోతుంది. దాదాపుగా 45 శాతం మేర భూములు ఐఆర్‌ఆర్‌కు సమకూరనున్నాయి. ఎటొచ్చీ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూములను తీసుకోవాల్సి మిగతా 6లో..

### 96.25 కిలోమీటర్లు.. 3,556.17 ఎకరాలు

ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) ప్రాజెక్టు అనేది గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు జిల్లాల పరిధిలో ఉంటుంది. మొత్తంగా 41 గ్రామాల్లో ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్ సాగుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఇన్నర్ రింగ్ రోడ్డు కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ మీదుగా కూడా వెళతుంది. ఐఆర్‌ఆర్‌కు సంబంధించిన అలైన్‌మెంట్, డీపీఆర్‌ను గతంలోనే 'స్టుప్' కన్సల్టెన్సీతో సీఆర్‌డీఏ తయారు చేయించింది. ఐఆర్‌ఆర్‌ను 75 మీటర్ల వెడల్పుతో మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున నిర్మించాలని డీపీఆర్‌ను రూపొందించటం జరిగింది. ఈ ప్రాజెక్టు కోసం 3,556.17 ఎకరాల భూములు అవసరమని ప్రతిపాదించింది. అమరావతి రాజధానిలోని 27 ప్రధాన రహదారులన్నింటినీ అనుసంధానించేలా ఇన్నర్ రింగ్ రోడ్డుకు తుది డీపీఆర్‌ను ఇవ్వటం జరిగింది. స్టుప్ సంస్థ ఇచ్చిన డీపీఆర్ ప్రకారం.. ఐఆర్‌ఆర్‌ను రెండు దశల్లో చేపట్టేలా నిర్ణయించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఎన్టీఆర్ జిల్లాలో కేతనకొండ దగ్గర ప్రారంభమవుతుంది. కృష్ణా జిల్లాలో చోడవరం దగ్గర ముగుస్తుంది.

# ఎఫ్ఎస్ఎల్‌కు అద్విక కంప్యూటర్లు

### హైదరాబాద్‌లో రెండు కార్యాలయాలు

- విజయవాడ కార్యాలయంలో కొనసాగుతున్న విచారణ
- ఏజెంట్లను పిలిపించి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): అధిక వడ్డీల చెల్లింపును ఎరగా వేసి కోట్లాది రూపాయలు వసూలు చేసిన అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. విజయవాడ ఎన్టీఆర్ కాలనీలో ఉన్న కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను పోలీసులు సీజ్ చేశారు. కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ఇక్కడే కాకుండా హైదరాబాద్‌లో రెండు చోట్ల కార్యాలయాలు నడుపుతున్నట్టు నిర్ధారించారు. ఈ రెండు కార్యాలయాల బాధ్యతలను ఇద్దరు తమ్ముళ్లకు అప్పగించినట్టు తెలిసింది. ఇప్పటికే ఒక బృందం హైదరాబాద్‌లో ఉండగా, తాజాగా మరో బృందం విజయవాడ నుంచి ఆదివారం బయలుదేరి వెళ్లింది. ఆ రెండు కార్యాలయాల్లో ఉన్న కంప్యూటర్లను సీజ్ చేసి ఇక్కడికి తీసుకొచ్చిన తర్వాత ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని నిర్ణయించారు. ఇప్పటికే మిగతా 6లో..

### బయటకు వస్తున్న బినామీ బాగోతం

ఆదిత్య అంటే లక్షలు కాదు... కోట్లు. అతడితో ఏ డీల్ అయినా కోట్లలోనే ఉంటుంది. ఓ ఏజెంట్ పోలీసుల వద్ద చేసిన వ్యాఖ్య ఇది. పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న బాధితులతో మాట్లాడినప్పుడు కొత్తకొత్త విషయాలు బయట పడుతున్నారు. అద్వికలో పెట్టుబడులు పెట్టిన వారిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పేర్లు బయటపడుతున్నాయి. వాళ్లంతా స్నేహితులు, పరిచయస్తుల పేర్ల మీద ఈ పెట్టుబడులు పెట్టించారని ప్రచారం జరుగుతోంది. దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ఈ విభాగం నుంచే ఎక్కువగా ఫోన్లు వస్తున్నాయి. అసలు ఆదిత్యపై కేసు నమోదు చేశారా, ఖాతాలు ఏమైనా స్తంభింపచేశారా, ఆ ఖాతాల్లో ఎంత మొత్తం నగదు నిల్వలు ఉన్నాయి అన్న వివరాలను చాలా శ్రద్ధగా అడిగి తెలుసుకుంటున్నారు. కొంతమంది కోసం రాజకీయ నేతలు ఫోన్లు చేస్తున్నారు.

### కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాలి

- వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రాష్ట్రాభివృద్ధి వెనక్కి
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి 6





స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు డీజీపీకి అందజేస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

## సుబ్బారాయుడి సేవలో డీజీపీ దంపతులు

మోపిదేవి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగ పుట్టలో పాలుపోసి స్వామివారికి విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు డీజీపీకి అందజేశారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, అవనిగడ్డ సబ్‌డివిజన్ పోలీసు అధికారులు ఆయన వెంట ఉన్నారు.

## పారదర్శకంగానే ఆశా నియామకాలు

- డీఎం అండ్ హెచ్‌వో సుహాసిని

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్త ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది వ్యక్తులు డబ్బులు వసూలుచేస్తూ మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆశాకార్యకర్తల నియామకం కోసం ఈనెల 25న నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ మార్గదర్శకాల ప్రకారం నియామక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. జిల్లా హెల్త్‌సొసైటీ ద్వారా మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

## ప్రతాప్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స



వినోద్ భువియన్‌తో డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాంచీకి చెందిన వినోద్ భువియన్‌కు ప్రతాప్ ఆసుపత్రి వైద్యులు అరుదైన చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. బాధితుడు విశాఖపట్నంలో పనిచేస్తుండగా కాలికింద భాగంలో తీవ్ర గాయమైంది. స్థానిక వైద్యులను సంప్రదించగా కాలును తీసేయాలని సూచించగా.. బాధితుడు విజయవాడ రామచంద్రనగర్‌లోని ప్రతాప్ ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించాడు. డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల(చీఫ్ ప్లాస్టిక్ సర్జన్), జాస్తి నవీన్‌చంద్ర(ఆర్థోపెడిక్) క్లిష్టమైన మైక్రో వాస్కులర్ ఏఎల్టీ ఫ్రీఫ్లాప్, ఇలిజారోవ్ రింగ్ ఫిక్సేటర్ శస్త్రచికిత్సను నిర్వహించి కాలును పునరుద్ధరించారు. బాధితుడు రెండువారాల్లో తిరిగి నడుస్తున్నట్టు డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల తెలిపారు.

## డాక్టర్ అశ్వనీకుమార్‌కు ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం అవార్డు



మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో అత్యున్నత సేవలందించిన డాక్టర్ అశ్వనీకుమార్‌కు ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఉత్తమ వైద్యుడి అవార్డు ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. అశ్వనీకుమార్ తొమ్మిది పదుల వయస్సు వచ్చినా మచిలీపట్నం, ఏలూరు తదితర ప్రాంతాల్లో ఆయన రోగులకు సేవలందిస్తూనే ఉన్నారు. మచిలీపట్నంలో ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, చెన్నారెడ్డికి వైద్యసేవలందించారు. త్రిపుర సుందరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వందలాది ఉచిత వైద్య సేవా శిబిరాల్లో మధుమేహ వ్యాధిగ్రస్తులకు అపార సేవలందించారు. ఈ సందర్భంగా అశ్వనీకుమార్‌కు డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య, డాక్టర్ కేశవకృష్ణ, బి.శ్రీనివాసాచార్య తదితరులు అభినందనలు తెలిపారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న షర్మిలారెడ్డి

## కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాలి

- వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రాష్ట్రాభివృద్ధి వెనక్కి
- కార్యకర్తల సమావేశంలో వైఎస్ షర్మిలా రెడ్డి

మచిలీపట్నం టౌన్, జూన్29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి అన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో జిల్లా అధ్యక్ష పదవి భర్తీపై కాసేపు చర్చ జరిగింది. కార్యకర్తల మనోభావాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. మచిలీపట్నం సమస్యలపై కార్యకర్తలు సమిష్టిగా ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ, నాయకులు అబ్దుల్ మతీన్, కోకా ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

## న్యాయవాదులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

విజయవాడ లీగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాద వృత్తి జీవనాధారంగా ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని సీపీఐ న్యాయవాదుల శాఖ మహాసభ తీర్మానించింది. 14వ మహాసభ ఆదివారం సూర్యారావుపేటలోని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ఎంఏ షరీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడి సాధించుకొన్న చట్టాలను నిర్వీర్యం చేస్తు ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ పరం చేస్తున్నాయని అన్నారు. జూలై 16, 17 తేదీల్లో నగర మహాసభలు, ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబరులో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని వివరించారు. సీపీఐ న్యాయవాదుల శాఖ నూతన కార్యదర్శిగా చలసాని అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కె.మధుసూదనరావు, జి.శ్రీనివాసరావు ఎంపికయ్యారు.

### రాజధానిలో పనుల పరిశీలనకు

# ప్రపంచబ్యాంకు బృందం రాక

- నేడు సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం
- రాజధానిలో నిర్మాణాలు, రోడ్ల పరిశీలన
- నిధుల కోసం బ్యాంకులు, రుణసంస్థలతో సీఆర్‌డీఏ చర్చలు
- మూడు నెలల్లో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్ టీమ్ విజయవాడ వచ్చింది. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, అధికారులతో సోమవారం ఈ బృందం ప్రాజెక్టు పనులపై సమీక్ష జరపనుంది. ఇటీవలే ప్రపంచబ్యాంకు సీఆర్‌డీఏకు రూ.5 వేల కోట్ల నిధులిచ్చింది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన తర్వాత పనులు కూడా జరుగుతున్నాయి. వీటిలో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టేవి సింహభాగం ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటారు. సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం తర్వాత ప్రపంచబ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్టు మిషన్ టీమ్ రాజధానిలో క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల పనులను పర్యవేక్షిస్తుంది. హెచ్‌వోడీ టవర్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, అఖిలభారత సర్వీసు (ఏఐఎస్) టవర్లు, మంత్రులు, హెచ్‌వోడీల బంగళాలతో పాటు రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తుంది. ఈ పరిశీలనను బట్టి మలివిడత నిధుల విడుదలకు సానుకూలత ఏర్పడుతుంది.

### రుణ సంస్థలతో సీఆర్‌డీఏ చర్చలు

అమరావతిలో ప్రస్తుతం సొంత నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు పనులు, ఇంకా తలపెట్టాల్సిన అనేక ప్రాజెక్టు పనులకు సంబంధించి అవసరమైన నిధుల కోసం సీఆర్‌డీఏ అధికారులు రుణ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు ప్రారంభించారు. బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాల పూచీకత్తుగా రుణాలు ఇవ్వటం జరగదు. ఆ స్థలాల్లో ఏదైనా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటే, రుణాలు ఇస్తాయి. ఇప్పటికిప్పుడు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాలంటే గ్రౌండ్ వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. అందుకే సీఆర్‌డీఏ అధికారులు రాజధాని భూముల్లో నిర్మాణ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణల ప్రకారం రెసిడెన్షియల్, కమర్షియల్ స్పేస్ అభివృద్ధికి ముందుకు వచ్చే సంస్థలకు సంబంధించి త్వరగా అగ్రిమెంట్లు కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. భూముల్లో నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంటే రుణాలు వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఆర్‌డీఏ అధికారులు బ్యాంకింగ్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. బ్యాంకర్లతోనే కాకుండా ప్రైవేట్ ఫైనాన్షియల్ సంస్థలు, విదేశీ సంస్థలు, ఇతర పద్ధతుల్లో కూడా నిధుల సమీకరణ జరిపేందుకు కసరత్తులు చేస్తున్నారు.

## భక్తుల సమస్యలపై మంత్రి ఆనం ఆరా

ఇంద్రకీలాద్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడిలో కనకదుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన భక్తుల సమస్యలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వయంగా తెలుసుకున్నారు. ఆదివారం దుర్గగుడికి విచ్చేసిన మంత్రి క్యూల్లో భక్తులతో మాట్లాడారు. భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, దేవస్థానం అధికారులు చేపట్టిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేయటంతో మంత్రి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈవో శీనానాయక్ ఆదివారం రాత్రి ఆలయంలో పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాత్రిపూట పంపిణీ చేసే అన్నప్రసాద నాణ్యత గురించి భక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



భక్తులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





జేసీబీలతో కనకదుర్గానగర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

### కనకదుర్గా నగర్‌లో..

# ఆక్రమణల తొలగింపు పూర్తి

- భక్తులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు
- ఈవో శీనానాయక్ వెల్లడి

ఇంద్రకీలాద్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6న అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తురాలిని కొబ్బరికాయ ధరపై ప్రశ్నించినందుకు వీధి వ్యాపారులు దాడిచేసి గాయపరచిన ఘటనపై దుర్గగుడి ఈవో తీవ్రంగా స్పందించారు. ఘటనపై వన్‌టౌన్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దీంతో అనధికార వ్యాపారాలపై అధికార యంత్రాంగం ఆరా తీసింది. దేవస్థానం టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలపై దేవస్థానం రికార్డులు పరిశీలించగా.. అర్జున వీధి నుంచి రథంసెంటర్ మార్గంలో సుమారు రూ.2కోట్లు దేవస్థాన నిధులతో 2016లో కొనుగోలు చేసిన స్థలం విషయం వెలుగుచూసింది. దీనిపై ఈవో ఆరా తీయగా అప్పట్లో రూ. కోట్లతో కొనుగోలు చేసిన స్థలం ఆక్రమణలకు గురికావడం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన ఈవో ఆక్రమణల తొలగింపుపై దేవదాయ శాఖ కమిషనర్, కలెక్టర్, పోలీసు, మునిసిపల్ కమిషనర్‌లకు ఈనెల 12న లేఖ రాశారు. 19న సంయుక్త సర్వే నిర్వహించి, స్థలం ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు సూచించారు. స్వచ్ఛందంగా పలువురు వ్యాపారులు ఖాళీచేసి తమ సామగ్రిని తీసుకువెళ్లారు. శనివారం నుంచి ఆదివారం వరకు ఆక్రమణల తొలగింపు కొనసాగింది. దేవస్థానం టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు జేసీబీలతో చదును చేసి, దేవస్థానం సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. దీనికోసం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్, ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో కోర్‌టీమ్ ఏర్పాటు చేశారు. వీరు ఆక్రమణల తొలగింపుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ దుర్గారావు ఆధ్వర్యంలో అడిషనల్ డీసీపీ రామకృష్ణ పర్యవేక్షణలో పోలీస్ భద్రత కొనసాగించారు.

### ఆక్రమణ తొలగింపుపై ఈవో వివరణ

ఇంద్రకీలాద్రి ప్రాంత ఆక్రమణల తొలగింపు విషయంలో అన్ని విధాలుగా ఆలోచించి ముందుకుసాగుతున్నాం. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయడానికే ఆక్రమణలు తొలగించాం. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలతో భక్తులు అసహనానికి గురవుతున్నారు. ఆక్రమణల తొలగింపుతో సుమారు వంద కార్లకు పార్కింగ్ స్థలం వచ్చింది. చిరు వ్యాపారుల సామగ్రిని ఇతర ప్రదేశాలకు తరలించడానికి ఆటోలు, మినీ వ్యాన్‌లు దేవస్థానమే ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యం కోసం ముున్ముందు మరింత అభివృద్ధి పనులు చేపడతాం.

## ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయి పురస్కారాలు

- మూడు విభాగాల్లో పోటీలు
- ఎంట్రీలకు చివరి తేదీ జూలై 31
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్ల నుంచి జిల్లాస్థాయి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31వ తేదీలోగా ఎంట్రీలు పంపాల్సి వుంటుందని తెలిపారు. మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని, మొదటివిభాగంలో జిల్లాలోని పర్యాటకప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర అంశాలు, రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం-2, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో లపై పోటీ వుంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ.10 వేలు), ద్వితీయ (రూ.7 వేలు), తృతీయ (రూ.4 వేలు) బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక విభాగం నుంచి మూడు ఫొటోలు, మొత్తం తొమ్మిది ఫొటోలు పంపవచ్చన్నారు. 2024, జూన్ 12 నుంచి 2025 జూలై 31 మధ్య తీసిన ఫొటోలు, సైజు 12/10 ఉండి.. ఎన్టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలన్నారు. ఉత్తమ ఫొటోల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని, ఎంట్రీలను డీపీఆర్వో కార్యాలయం చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా పంపవచ్చని, ఇతర వివరాలకు 9121215373లో సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



కళ్లేపల్లి మధుసూదన్‌రాజు దంపతులను సత్కరిస్తున్న విద్యాసాగర్

### గ్రంథాలయాల పునరుద్ధరణలో

## కళ్లేపల్లి పాత్ర మరువలేనిది

- ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విద్యాధరపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూతపడుతున్న గ్రంథాలయాలను పునరుద్ధరించిన వ్యక్తి కళ్లేపల్లి మధుసూదన రాజు అని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం విద్యాధరపురం సితార సెంటర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గ్రేడ్-3 అధికారి, గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదన్‌రాజు ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా అలపర్తి విద్యాసాగర్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, మధుసూదన్‌రాజు గ్రంథాలయ శాఖలో చిరుద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి గ్రంథాలయ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేయటం అసాధారణ విషయమన్నారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ, మధుసూదనరాజు గ్రంథాలయాల పురోభివృద్ధికోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల సంచాలకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయటమే కాకుండా ప్రభుత్వంతో చర్చించి మూతపడుతున్న గ్రంథాలయాలను పునరుద్ధరించిన నాయకుడు మధుసూదన్‌రాజు అని కొనియాడారు. అనంతరం మధుసూదన్‌రాజు, పార్వతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ బండారు హనుమంతరావు, సినీ నటుడు శోభన్‌బాబు మేనల్లుడు వేగే రాజా, గ్రంథాలయాల డిప్యూటీ డైరెక్టర్ పీర్ అహ్మద్, వివిధ జిల్లాల గ్రంథాలయాల అధ్యక్షులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సెమినార్‌కు నలుగురు చైర్‌పర్సన్ల ఎంపిక

జగ్గయ్యపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హర్యానాలోని గురుగ్రామ్‌లో జులై 3, 4 తేదీల్లో భారత పార్లమెంట్, హరియాణా ప్రభుత్వ సహకారంతో 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అంశంపై నిర్వహిస్తున్న జాతీయస్థాయి సెమినార్‌కు జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, తిరువూరు మునిసిపాలిటి నుంచి కొలికలపూడి నిర్మల, కొండపల్లి మునిసిపాలిటి నుంచి చెన్నుబోయిన చిట్టిబాబులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

## ఎఫ్ఎస్ఎల్‌కు అద్విక కంప్యూటర్లు

(5వ పేజీ తరువాయి)

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల్లో ఉన్న వివరాలను మొత్తం ఆదిత్య తీసేశాడు. ఇదిప్పుడు పోలీసులకు సవాలుగా మారింది.

### కార్యాలయంలో సుదీర్ఘ విచారణ

ఆదిత్యను పోలీసులు ఎన్టీఆర్ కాలనీలో ఉన్న అద్విక కార్యాలయంలో ఆదివారం సుదీర్ఘంగా విచారించారు. సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదరరావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు, మాచవరం ఎస్ఐలు ఉదయం నుంచి రాత్రి వరకు విచారించారు. ఆదిత్య ఫోన్‌ను సీజ్ చేసిన పోలీసులు అందులో వాట్సాప్ చాటింగ్‌ను పరిశీలిస్తున్నారు. దీనిద్వారా అద్వికలోకి భారీగా పెట్టుబడులను రప్పించిన పది మంది ఏజెంట్లను గుర్తించారు. వాళ్లందరిని అద్విక కార్యాలయానికి పిలిపించారు. ఒక్కొక్కరి వాంగ్మూలం తీసుకున్నారు. ఎవరెవరి నుంచి ఎంతెంత సొమ్ములను ఇందులో పెట్టుబడిగా పెట్టించారో వివరాలు రాబట్టారు. కొంతమంది ఏజెంట్లు కమీషన్ల రూపంలో ఆదిత్య నుంచి భారీగానే లాగేసినట్టు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఏజెంట్‌గా వ్యవహరిస్తూ రూ.25కోట్లు పెట్టుబడులుగా పెట్టించాడు.

## నిర్లక్ష్యపు జాడ్యం!

(5వ పేజీ తరువాయి)

ఖాళీగా కూర్చుని వెళ్లిపోతున్నారు. జెడ్పీ అధికారులు మాత్రం బదిలీపై వచ్చిన ఉద్యోగులకు ఆయా విభాగాల్లో సీట్లు మాత్రం కేటాయించకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ పంపిన ఫైళ్లను జెడ్పీ సీఈవో నిబంధనలకు విరుద్ధమని పక్కన పెట్టడం, సీఈవో నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ వద్దకు వెళ్లిన ఫైళ్లు ఆమోదానికి నోచుకోకపోవడం ఆనవాయితీగా మారిందని జెడ్పీ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

### అధికారుల సర్వీస్ మేటర్ ఫైళ్లు పెండింగ్‌లోనే..

జిల్లా పరిషత్‌లో గత రెండు, మూడు సంవత్సరాలుగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పరిపాలనలో అనుభవం ఉండి, ఫైళ్లను చకాచకా తయారు చేసే నైపుణ్యం ఉన్న సీనియర్ ఉద్యోగులంతా వివిధ కారణాలతో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి బయటి ప్రాంతాలకు బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. వారి స్థానంలో జూనియర్‌లు వచ్చారు. వీరికి ఆయా సెక్షన్‌లలో పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించకపోవడంతో జిల్లాపరిషత్ యాజమాన్యంలో పనిచేసే అధికారులు, సిబ్బందికి సంబంధించిన ఫైళ్లు దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉండి పోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

### డీఎల్‌డీవోలు స్వయంగా వచ్చి ఫైళ్లు చూసుకునే దుస్థితి

ఇటీవల కాలంలో డీఎల్‌డీవో(డీడీవో)లకు సంబంధించి జీపీఎఫ్ ఫైళ్లు జిల్లా పరిషత్‌కు వచ్చాయి. వీటిని సరిచూసి పంపాల్సి ఉండగా పెండింగ్‌లో పెట్టారు. దీంతో డీఎల్‌డీవోలు స్వయంగా జెడ్పీ కార్యాలయానికి వచ్చి సంబంధిత ఫైళ్లను సరిచేసుకున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్ ఖాతాల వివరాలు తెలియజేసేవారే లేరని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ఫైళ్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండి పోయాయని ఉద్యోగులు అంటున్నారు. జిల్లాలో పనిచేసే ఎంపీడీవోల సర్వీస్ మేటర్ ఫైళ్లు కూడా దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఎంపీడీవోలు జెడ్పీ డిప్యూటీ సీఈవో వద్దకు వెళ్లి లేదా ఫోన్‌లో సంప్రదించి తమ సర్వీస్‌మేటర్‌లకు సంబంధించిన అంశాలను త్వరితగతిన పూర్తిచేయాలని పదేపదే కోరుతున్నారని తెలిసింది.

## ఇక వేగంగా..

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఈ రెండు జిల్లాల్లో కూడా భూ సమీకరణ కిందనే భూములను తీసుకోవాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. దీని కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ పరిధిలోని మండలాల్లో గ్రామ సభలు నిర్వహించనుంది. గ్రామ సభల్లో ఐఆర్ఆర్ ఉద్దేశ్యాన్ని వివరించి, రైతులతో చర్చలు జరిపి వారి అభిప్రాయాలను తీసుకుంటుంది. గ్రామ పంచాయతీల తీర్మానాలను కూడా తీసుకుంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావటానికి మూడు నెలల డెడ్‌లైన్‌ను సీఆర్‌డీఏ నిర్దేశించుకుంది. డెడ్‌లైన్ పూర్తి కాగానే బీవోటీ విధానంలో టెండరు నోటిఫికేషన్‌ను వెలువరించనుంది. బీవోటీ విధానంలో కాబట్టి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు సంస్థ మాత్రమే చేపడుతుంది. ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించే సంస్థకు నిర్ణీత కాలపరిమితి మేరకు నిర్వహణ చేపట్టి ఆ తర్వాత ప్రభుత్వానికి యాజమాన్య హక్కులను అప్పగిస్తుంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలోనే అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ వేలు, ఎయిర్‌పోర్టులు నిర్మిస్తున్నారు.

### భూ సమీకరణ జరిగే ప్రాంతాలు?

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం మొత్తం 1,155.41 ఎకరాల భూములు అవసరమవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో దాములూరులో 29.9 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 7.17 ఎకరాలు, జూపూడిలో 0.23 ఎకరాలు, కేతనకొండలో 58.33 ఎకరాలు, కొండపల్లిలో 93.40 ఎకరాలు, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో 100.65 ఎకరాలు, కొటికలపూడిలో 37.41 ఎకరాలు, నవీపోతవరంలో 30.33 ఎకరాలు, త్రిలోచనాపురంలో 20.15 ఎకరాలు, జమీ మాచవరంలో 3.31 ఎకరాలను సమీకరించనున్నారు. జీ కొండూరు మండలంలో కవులూరు గ్రామంలో 74.83 ఎకరాలు, వెలగలేరు గ్రామంలో 2.85 ఎకరాలు, విజయవాడ రూరల్ మండలంలో దోనె ఆత్కూరు గ్రామంలో 19.43 ఎకరాలు, కొత్తూరు గ్రామంలో 55.15 ఎకరాలు, నున్నలో 96.86 ఎకరాలు, పాతపాడులో 48.57 ఎకరాలు, తాడేపల్లిలో 16.25 ఎకరాలు, నిడమానూరులో 73.96 ఎకరాలను సమీకరించనున్నారు. కృష్ణా జిల్లా విషయానికి వస్తే గన్నవరం మండలం పరిధిలో రామచంద్రాపురంలో 5.25 ఎకరాలు, వెదురుపావులూరు గ్రామంలో 132.86 ఎకరాలు, సావారిగూడెంలో 18.71 ఎకరాలను సమీకరిస్తారు. పెనమలూరు మండలం చోడవరం గ్రామంలో 85.91 ఎకరాలు, గంగూరులో 5 ఎకరాలు, పెనమలూరులో 49.62 ఎకరాలు, పోరంకిలో 89.27 ఎకరాల చొప్పున సమీకరించనున్నారు.



## బంగారు బోనం

(5వ పేజీ తరువాయి)

సమర్పించింది. 500 మంది భక్తులు నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. తొలుత జమ్మిదొడ్డిలో బంగారు బోనానికి కమిటీ సభ్యులతో కలిసి దుర్గగుడి ఈవో శీనానాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అట్టహాసంగా ఊరేగింపు బయలుదేరింది. బంగారు బోనం ఎత్తుకున్న మహిళలు అమ్మవారి నామస్మరణ చేస్తూ దుర్గామల్లేశ్వర దేవస్థానం సమకూర్చిన చిన్నారుల నెమలి నృత్యాలు, గరగ నృత్యాలు, తప్పెట్లు, కోలాటాలు, సంప్రదాయ భజనలతో ముందుకు సాగారు. జమ్మిదొడ్డి నుంచి బ్రాహ్మణ వీధి, రథం సెంటర్, దుర్గాఘాట్, ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకున్నారు. కొండపైన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఈవో శీనానాయక్ వేద మంత్రోచ్ఛరణల నడుమ బంగారు బోనాన్ని స్వీకరించి అమ్మవారికి సమర్పించారు. తెలుగు రాష్ట్రాలు పాడిపంటలతో, సుఖ శాంతులతో వర్ధిల్లేలా ఆశీర్వదించాలని బంగారు బోనం సమర్పించిన కమిటీ సభ్యులు కోరుకున్నారు.

## సెలవు రోజు గుట్టుగా..

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి అనుమతులు లేని పొలంలో బుసక తవ్వకాలు కనిపించాయి. పొలంలో ఒక లారీ బుసక లోడింగ్ కోసం ఉంది. మరో వైపు కళ్లంవారిపాలెం పాయలో ఎక్స్‌కవేటర్‌తో మరో లారీలోకి ఇసుక లోడింగ్ జరుగుతు ఉంది. మీడియాను చూసి ఇసుక లోడింగ్ ఆపి బుసక లోడింగ్‌ను చేపట్టారు. వీఆర్వో నాగేశ్వరరావుకి సమాచారం ఇవ్వగా వీఆర్ఏను పంపిస్తాను అని చెప్పారు. కానీ ఐదు గంటల వరకు వీఆర్ఏ రాలేదు. బుసక లోడింగ్ లారీని బయటకు పంపించి ఎక్స్‌కవేటర్‌ను రెల్లిదుబ్బుల్లో పెట్టారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 102, 110, 121 |
| చికెన్ విత్ స్కిన్ | 194 |
| చికెన్ స్కిన్‌లెస్ | 204 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

**పెనమలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** విజయవాడలో జరిగిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ క్రీడల్లో యువనేత బోడె వెంకట్రామ్ పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తనయుడు రవితేజలతో పాటు వెంకట్రామ్ ఫెన్సింగ్ పోటీలు ప్రారంభించారు.



# ఆదాయం జాస్తి.. అభివృద్ధి నాస్తి!

- అస్తవ్యస్త రోడ్లు.. డ్రెయినేజీ..
- వెలగని వీధిలైట్లు.. తాగునీటి ఇబ్బందులు..
- మౌలిక సౌకర్యాలు కరువు.. పట్టించుకోని పాలకులు, అధికారులు
- కానూరు న్యూఆటోనగర్ దుస్థితి

(కానూరు - ఆంధ్రజ్యోతి)

కానూరు న్యూఆటోనగర్ నుంచి లక్షల్లో ఆదాయం వస్తున్నా అభివృద్ధిలో వెనుకంజలో ఉంది. దీంతో ఇక్కడ సమస్యలు తిష్టవేశాయి. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం ఇది ఏర్పాటైనా నేటికినీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఆనాటి నుంచి నేటి వరకు ఏపీఐఐసీ- ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) అధికారులు న్యూఆటోనగర్ అభివృద్ధి మరిచారు. ఇక్కడ ఉంచి ఏడాదికి సుమారు రూ. కోటి వరకు ఆదాయం వస్తున్నా దీని అభివృద్ధికి అధికారులు మాత్రం దృష్టి సారించడంలేదు.

### నిలువెత్తు గోతులతో రోడ్లు

కానూరు న్యూఆటోనగర్‌లోని మెయిన్‌రోడ్డుతోపాటు అంతర్గత రోడ్లు నిలువెత్తు గోతులతో దర్శనమిస్తోన్నాయి. వర్షంపడితే ఈ రోడ్లపై వెళ్లడమే కష్టం. ముడిపదార్థాలు తీసుకువచ్చే వాహనాలు, ఇక్కడ తయారైన వస్తువులను తీసుకువెళ్లే వాహనచోదకులు నిలువెత్తు గోతులతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే ఈరోడ్లపై నడవడమే కష్టతరంగా ఉంది.

● కానూరు న్యూఆటోనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సరైన డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు, వర్షంనీరు రోడ్లపైకి వచ్చి దుర్వాసన కొడుతోంది. దీనికి తోడు తాడిగడప వంద అడుగుల రోడ్లు- న్యూ ఆటోనగర్ ప్రాంతంలో మేజర్ డ్రెయినేజీ ఉన్నా అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడంతో మురుగునీరు కదలడంలేదు.

### పారిశుధ్యం అధ్వానం

న్యూఆటోనగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. అవసరమైన మేర పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో ఇక్కడ చెత్త కుప్పలు, వ్యర్థాలు అక్కడే దర్శనమిస్తోన్నాయి. షాపులు, హోటళ్లు, పరిశ్రమల్లోని వ్యర్థాలన్నీ రోడ్లపైనే వేస్తున్నారు. ఐలా అధికారులు న్యూఆటోనగర్ నుంచి పన్నుల రూపేణా డబ్బులు వసూలు చేస్తూ ఖర్చుమాత్రం పెట్టడంలేదు.

● న్యూఆటోనగర్‌లో వీధిలైట్లు నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయింది. వెలగని వీధిలైట్లుకు మరమత్తులు చేయడం గానీ లేదా కొత్త లైట్లు వేయడంగాని ఐలా అధికారులు చేయడం లేదు. గతం లో ప్లాట్ ఓనర్స్ నిధులు సేకరించి వంద వీధిలైట్‌లను ఏర్పాటు చేసుకున్నారు.

● కానూరు న్యూఆటోనగర్ నుంచి దీని నిర్వహణ చూసే ఐలాకు ఏడాదికి సుమారు రూ. కోటి వరకు ఆదాయం వస్తోంది. అయినా అభివృద్ధి శూన్యం గానే ఉంది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ప్రాంతంలో మొక్కలు నాటుతుంటారు. అయితే ఇక్కడ మచ్చుకైనా చెట్లు కనిపించవు.



కానూరు న్యూఆటోనగర్‌లో అధ్వానంగా రోడ్లు.. ప్లాస్టిక్‌వ్యర్థాలు, మురుగునీటితో ఉన్న మేజర్ డ్రెయినేజీ

### సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తాం



ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కానూరు న్యూఆటో నగర్ సమస్యలు తీసుకువెళతాం. 2000లో చంద్రబాబు న్యూఆటోనగర్‌కు శంకుస్థాపన చేశారు. నేటికినీ పూర్తిగా అభివృద్ధికి నోచుకో లేదు. తరువాత వచ్చిన పాలకులు, అధికారులు శ్రద్ధ కనబరచకపోవడంతో అభివృద్ధి జరగలేదు.

**- పూసా రమేష్‌బాబు, కానూరు న్యూఆటోనగర్ ప్లాట్ ఓనర్సు అసోసియేషన్ కోశాధికారి**

### రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలి



న్యూ ఆటోనగర్‌లో రోడ్లు, డ్రెయినేజీ సమస్య అధికంగా ఉంది. రోడ్లలో నిలువెత్తు గోతులు ఉన్నాయి. వర్షం వస్తే రోడ్లపై నడవడమే కష్టంగా ఉంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థలేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకే వచ్చి దుర్వాసన కొడుతోంది.

**- బీవీ శ్యామలారావు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు**

## కోడిపందేల శిబిరంపై దాడి

**16 మందిపై కేసు నమోదు**

**విజయవాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):** విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామ సమీపంలో కోడి పందాల శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీ సులు ఆదివారం దాడి చేశారు. గ్రామం శివారుల్లో కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం మామిడి తోటల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. పందాలు నిర్వహిస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 9 ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్లు, రూ. 17,000 నగదును స్వాధీనం చేసుకుని నున్న రూరల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.




రహదారి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ కాటూరి

## రహదారికి మరమ్మతులు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) :** గ్రామంలోని ప్రధాన రహదారులు, న్యూ హౌసింగ్ కాలనీ ప్రధాన రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నట్టు సర్పంచ్ కాటూరి విజయభాస్కర్ తెలిపారు. బొమ్ములూరు, బొమ్ములూరు కండ్రిక గ్రామాల్లోని అంతర్గత రహదారులు, న్యూ హౌసింగ్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారులకు ఆదివారం తాత్కాలికంగా కంకరతో కూడిన డస్ట్‌తో చేయిస్తున్న మరమ్మతులను ఆయన పర్యవేక్షించారు.








వైస్ హాస్పిటల్ ప్రారంభోత్సవ జ్యోతి ప్రజ్వలనలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గద్దె.. హాస్పిటల్‌లో ఓ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

## కానూరులో వైస్ హాస్పిటల్ ప్రారంభం

**కానూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):** కానూరు పంటకాలువ రోడ్డులో వైస్ హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ సుధా చదలవాడ, డాక్టర్ నాగేశ్వరరావు చదలవాడ, డాక్టర్ ఎస్. సుబ్బారావు, డాక్టర్ జయంతిరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ శ్రీరమ్య కంటిపూడిలు పాల్గొని మాట్లాడుతూ, వైస్ హాస్పిటల్‌లో సర్జికల్, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, గైనకాలజీ, ఆబ్స్టెట్రిక్స్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్ వెలినేనితోపాటు పలువురు ప్రముఖు పాల్గొన్నారు.



గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో వల్లూరు శ్రీమన్నారాయణ తదితరులు

## మర్యాదపూర్వక కలయిక

**త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసిన వల్లూరు శ్రీమన్నారాయణ**

**పెనమలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని భారతీయ జనసంఘ్, బీజేపీ సీనియర్ నేత వల్లూరు శ్రీమన్నారాయణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ఉన్న గవర్నర్‌ను కలిసి గతంలో వారు కలిసి పనిచేసిన విషయాల గురించి చర్చించారు. శ్రీమన్నారాయణతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు కుక్కపల్లి నాగేశ్వరరావు, పొట్టి శ్రీహరి తదితరులు ఉన్నారు.

### త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఘన స్వాగతం

**గన్నవరం :** త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆదివారం హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఇక్కడికి విచ్చేసారు. ఆయనకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ శేషుకుమార్, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, తదితరులు పూల బోకేలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.

## పేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యం: నాదిండ్ల

**గన్నవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):** పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు నాదిండ్ల మోహన్ అన్నారు. మండలంలోని సావరగూడెం గ్రామానికి చెందిన 50మంది యువకులు ఆదివారం బీజేపీలో చేరారు. అలాగే సావరగూడెంతో పాటు అజ్జంపూడి, కేసరపల్లి, జక్కులనెక్కలం గ్రామాల్లో కిసాన్ మోర్చా గ్రామ కమిటీలను వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్, కానూరి శేషుమాధవి, కొల్లి శ్రీనివాసరావు, వంగల శ్రీను, వేమూరి అప్పయ్య, గాబ్రియేలు, ఎం.శేషుబాబు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన యువకులతో నాదిండ్ల మోహన్

ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో

## పెరికీడులో సమస్యల పరిష్కారం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఎమ్మెల్యే యార్లగడ్డ దృష్టికి తీసువచ్చిన గంటల వ్యవధిలోనే అధికారులు పరిష్కరించారు. పెరికీడులోని ఏలూరు కాలువ వద్ద కాకులపాడు చానల్ నీటి విడుదలకు వచ్చిన ఎమ్మెల్యేకు అంగన్‌వాడీ భవన ప్రహరీ నిర్మాణం గురించి అక్కడ సిబ్బంది వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడిక్కడే రెవెన్యూ సిబ్బందికి ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆదివారం భూసర్వే నిర్వహించారు. ప్రహరీ నిర్మాణానికి మార్గం సుగమమయింది. ● డ్రెయినేజీ పూడుకుపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలియజేయడంతో వెంటనే శుభ్రం చేసి మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆదివారం పారిశుధ్య కార్మికులు డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టారు.



పెరికీడు డ్రెయిన్‌లో పూడికతీస్తున్న కార్మికులు

## లక్ష్మీ తిరుపతమ్మకు ఆషాఢ సారె సమర్పణ

**గన్నవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆషాఢమాసం తొలి ఆదివారం సంద ర్భంగా అమ్మవారికి ఆషాఢ సారేను భక్తులు సమర్పించారు. గ్రామంలో అన్ని వర్గాలకు చెందిన మహిళలచే శ్రీలక్ష్మీ తిరుపత మ్మకు ఆషాఢ సారేను ఘనంగా సమర్పించారు. అంకమ్మతల్లికి ఆషాఢ మాసం తొలి బోనాన్ని భక్తులు సమర్పించారు. సాయంత్రం వారాహి నవరా త్రులు నాల్గోవ రోజును పురస్కరించుకుని శ్రీలలితా సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తరం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షు లు జాస్తి శ్రీధర్, కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్, చిమట శ్రీనివాసరావు, కాసన్నేని నాని, గూడపాటి సీతారాంబాబు, పొట్ల శివలీల, జాస్తి అనంతలక్ష్మీ, కొడాలి సంధ్యారాణి, కాసన్నేని బుజ్జమ్మ, పెడసనగంటి రామేశ్వరి, టి. రత్నకుమారి, పడమట శోభరాణి, అల్లాపురం బేబి, మోదుగుమూడి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ తిరుపతమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు



యోగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న గొట్టిపాటి రామకృష్ణప్రసాద్

## యోగా జీవితంలో భాగం కావాలి

**యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి**

**ఉయ్యూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** యోగాను జీవితంలో భాగంగా చేసుకుని మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. సాత్విక్ యోగా చారిటబుల్ ట్రస్ట్‌లో 50 రోజులు 50 ఆసనాలు శిక్షణ పొందిన వారికి గండిగుంటలో గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ఆవరణలో ఆదివారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షురాలు అనంతనేని రాధిక, భారత స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దామర్ల దుర్గారావు, సాత్విక్ యోగా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చిందా కుటుంబరాజు, సెక్రటరీ జంపాన శ్రీనివాసగౌడ్, ముక్తిపథం జ్ఞాన యజ్ఞ యోగాశ్రమ స్థాపకుడు ఎన్. శ్రీనివాసరావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ ముదిగొండ నాగ వీర భద్రశాస్త్రి, యోగాచార్య దావులూరి రాధాకృష్ణ మూర్తి, గరికపాటి వెంకట సుబ్బారావు, నూకల సాంబశివరావు, యోగా శిక్షకుడు జి.కృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు విడుదల చేయాలంటూ..

## సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నేడు

**కానూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** రబీ ధాన్యం బకా యిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడ కానూరు బందరు రోడ్డులోని సివిల్ సప్లయ్ కార్పొ రేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం పిలుపు నిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం. యల్లమందారావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్యలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రబీ ధాన్యం బకాయిలు సుమారు రూ. వెయ్యి కోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. బకాయిలు రావాలిసిన రైతులు, కౌలురైతులు ఈ ధర్నా కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.



బాలుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

## బాలుడికి ఆర్థిక సాయం

**పెనమలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** యనమలకుదురు విద్యుత్ సెక్షన్‌లోని భగత్‌సింగ్‌నగర్, అవనిగడ్డ కరకట్ట 11కేవీ ఆర్‌ఎల్‌ఎస్ ఫీడర్‌లో రెండేళ్ల క్రితం విద్యుత్ ప్రమాదం జరిగింది. గత ప్రభుత్వంలో జరిగిన ఈ ప్రమాదంలో యనమలకుదురుకు చెందిన తొమ్మిదేళ్ల మున్నంగి హరిసుమంత్ కాలు చెయ్యి కోల్పోయాడు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు బాలుడి దుస్థితిని కనీసం పట్టించుకోలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సంప్రదించగా ఆయన సంస్థ సీఎండీ పుల్లారెడ్డికి బాలుడికి జరిగిన అన్యాయాన్ని నివేదించి ఐదు లక్షల పరిహారాన్ని మంజూరు చేయించారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలుడికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, ఏడీఈ నవీన్, ఏఈ సాంబశివరావు, ఎల్లై సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డీఎం నేడు

**గన్నవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని డిపో మేనేజర్ పి.శివాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజలు, సలహాలు, సూచనలు సమస్యలు 87909-96090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని ఆయన పేర్కొన్నారు.

## మెరుగైన సేవలకే పెట్రోలింగ్ వాహనాలు

**డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు**

**గన్నవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం ట్రాఫిక్ లిమిట్స్‌లో ట్రాఫిక్ నియంత్రణకు నాలుగు మోటార్ వాహనాలను కేటాయించగా వాటిని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ సీఐ శివప్ర సాద్, ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణకు కేటాయించిన వాహనాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు





# గుడివాడ

● గుడివాడ ● పామర్రు

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 102, 110, 121 |
| చికెన్ విత్ స్కిన్ | 194 |
| చికెన్ స్కిన్‌లెస్ | 204 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590



## గంగానమ్మకు ఆషాఢ సారె

కూచిపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంక మద్దు గ్రామ శివారు మల్లికార్జునపురంలోని గంగానమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కొండాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

## కొండాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

గుడ్లవల్లేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం 15000 మంది భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల పొంగళ్లు వండి అమ్మవారికి నమస్కరించి మొక్కులు చెల్లించుకున్నారని కొండలరావు తెలిపారు. కాగా అమ్మవారిని విజయా డైరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, తదితరులు దర్శించుకున్నారు.

# టీచర్స్ కాలనీ రహదారులు అధ్వానం

● అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ నిల్
● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ): స్థానిక టీచర్స్ కాలనీ సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. అంతర్గత రహదారులు లేవు. డ్రెయినేజీ వ్యవస్థ లేదు. చిన్నపాటి వర్షానికే రహదారుల్లో గుంతల్లో మురుగునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడిన వాటిని పూడ్చిన దాఖలాలు లేవు. 2014-19 టీడీపీ హయాం లో టీచర్స్ కాలనీలో ప్రధాన రహదారితో పాటు కొన్ని అంతర్గత రహదారుల నిర్మాణం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం కాలనీలోని సమస్యలపై దృష్టి సారించలేదు. వాటర్ ట్యాంకు రహదారిలో వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. చిన్నపాటి వర్షానికే కాలనీ ప్రధాన రహదారి జలమయం అవుతుంది. ఈ రహదారి గుండా వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులు, పాదచారులు, సైకిళ్లపై వెళ్లే పాఠశాల విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. కొందరైతే తమ ఇళ్ల ముందున్న గోతులను వారే పూడ్చుకుంటున్నారు. రాత్రి వేళల్లో దోమల వ్యాప్తితో ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కనీసం గుంతలను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### త్వరలో మరమ్మతు పనులు ప్రారంభిస్తాం

మున్సిపాలిటీ వచ్చిన రూ.10కోట్లు స్పెషల్ గ్రాంటులో నుంచి కాలనీ ప్రధాన రహదారి, డ్రెయినేజీ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. అనుమతులు వచ్చిన వెంటనే మరమ్మతు పనులను ప్రారంభిస్తాం.

**సింహాద్రి మనోహర్, మున్సిపల్ కమిషనర్**



భారీ గోతులతో నిండిన టీచర్స్ కాలనీలో ప్రధాన రహదారి



అంతర్గత రహదారుల్లో నిలిచిన వర్షపు నీటితో ఇబ్బందులు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

కూచిపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కేసరి ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు ఆదివారం నిడుమోలులో అదుపు తప్పి మెయిన్ రోడ్డు పైనుంచి సర్వీస్ రోడ్డుపై వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సమయంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. బస్సు ముందు భాగం దెబ్బతింది. స్తంభాన్ని ఢీకొట్టి వైర్లు తెగిపోవటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పెను ప్రమాదం తప్పింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

పామర్రు : ప్రస్తుత ఖరీఫ్‌సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నలకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తప్పవని పామర్రు మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగిణి హెచ్చరించారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు కొనుగోలు చేసిన దానికి బిల్లు తప్పనిసరిగా అందించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని విత్తనాలు అమ్మేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.




# సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

● సీఐటీయూ నేత గంగాధర ప్రసాద్

పామర్రు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ జూలై 9వతేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు అంతా సిద్ధం కావాలని పామర్రు డివిజన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఒడుగు గంగాధర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఒకటో గ్రామ సచివాలయం వద్ద గల సమావేశపు హాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘనేత విశ్వనాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో యూనియన్‌లు ఏర్పాటు చేసుకోవడం కష్టతరం కానున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఆనాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కితీసుకోవాలని డిమాండ్‌చేశారు. కనీసవేతనాలు రూ.26 వేలు అమలుచేయాలని, ప్రభుత్వ రంగాల పరిరక్షణ, రైతాంగానికి మద్దతు ధరలు అందించాలనే తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నామన్నారు. ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈమేరకు సమ్మెలో పాల్గొనబోతున్నట్టు పంచాయతీ శానిటరి ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు సీఐటీయూ నేతలతో కలసి సమ్మెనోటీసు అందించారు.మండల సీఐటీయూ కార్యదర్శి ఐంటిరాజు, కార్మిక సంఘనేతలు వెంకట్రామయ్య, ఆలీఖ్య, నాగమణిపాల్గొన్నారు.



సుధాకర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నేతలు

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

● వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్

గుడివాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు తన నడవడికను మార్చుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూపట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సైలు పాల్గొన్నారు.

పెదపారుపూడి : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పెదపారుపూడి పోలీస్ స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లు నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్

# చౌటపల్లి పంచాయతీలో రికార్డుల పరిశీలన

గుడివాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి పంచాయతీలో మౌలిక వసతులు సక్రమంగా ఉన్నవి లేనిది పరిశీలిస్తున్నట్లు మచిలీపట్నం డీఎల్‌పీవో, చౌటపల్లి పంచాయతీ నోడల్ అధికారి రజావుల్లా అన్నారు. ఆదివారం చౌటపల్లి పంచాయతీలో పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 కార్యక్రమంలో భాగంగా డీఎల్‌పీవో అంగన్వాడీ కేంద్రాలను, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. అవి శుభ్రంగా ఉన్నాయా? తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2025కు ఎంపికైన సందర్భంగా అన్ని వసతులు ఏర్పాటు చేయటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ భవనంలో పిల్లలను ఏవిధంగా చూస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రహదారులు, డ్రెయిన్లు తదితర విషయాలపై కార్యదర్శి హరికృష్ణను వివరాలు అడిగారు. సర్పంచ్ వెంగలేటి రమ్య, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.



పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న రజావుల్లా

# రహదారిపై కొబ్బరిబొండాలతో తప్పని తిప్పలు

గుడివాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాగవరప్పాడు - జొన్నపాడు జాతీయ రహదారి పక్కన పడేస్తున్నారు. ఆ కొబ్బరిబొండాలు రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు కొబ్బరి బొండాలు తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతోపాటుగా లింగవరం వెళ్లే పంట కాలువలోకి వాడిన కొబ్బరి బొండాలు, ఇతర వ్యర్థాలను రాత్రి సమయాల్లో వ్యాన్ల ద్వారా డంపింగ్ చేస్తున్నారు. వీటి వల్ల ద్విచక్ర వాహనాలు, భారీ వాహనములు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడింది. లింగవరం పంటకాలువలోకి వదులుతున్నారు. వర్షాల కారణంగా పంటకాలువలోకి నీరు కలుషితమై గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొబ్బరిబొండాలను జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో డంపింగ్ చేయకుండా, లింగవరం, తమిరిశ పంట కాలువల్లోకి వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇలా చేయటం వల్ల రాకపోకల సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నామన్నామని వాహనదారులు వాపోతున్నారు.



జాతీయ రహదారిపై గుట్టలుగా కొబ్బరిబొండాలు

## గంజాయి విక్రేతల అరెస్టు

గుడ్లవల్లేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయానికి పాల్పడుతున్న 5 గురు యువకులను ఆదివారం గుడివాడ ఏఈఎస్‌సీఎం జడ్జి ముందు హాజరు పరిచిన ఉదంతమిది. గుడ్లవల్లేరు గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన కొందరు యువకులు చంద్రాల గ్రామ పంచాయతీ శివారు సింగలూరు గ్రామ పొలిమేరల్లో శనివారం బయట నుంచి తెచ్చిన 1300 గ్రాముల గంజాయిని పొట్లాలుగా కడుతున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి. సత్యనారాయణ మఫ్టీలా స్థలానికి చేరుకుని ఆయువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బంకుర కొండలరావు, మత్తే ప్రకాష్, కొటే భార్గవ్, బడుగు భువనేశంకర్, మేరుగు జాన్‌బాబు అను ఐదుగురిని విచారించిన అనంతరం ఆదివారం గుడివాడ ఏజేఎస్‌సీఎం జడ్జి ముందు హాజరుపరిచామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

# తప్పిపోయిన కుక్కపిల్ల .. ఆచూకీ తెలిపిన వ్యక్తికి పారితోషకం

గుడివాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడైన డాక్టర్ దాశరథికి తన కుక్కంటే అమితమైన ప్రేమ. శనివారం సాయంత్రం కుక్క తప్పిపోవడంతో ఆయన వెతికిన చోటంటూ లేదు. కుక్కపిల్ల మీద ఉన్న అభిమానం, ప్రేమతో వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టి ఆచూకీ తెలిపిన వారికి రూ.20వేలు పారితోషకంగా ఇస్తానని ప్రకటించారు. ఆదివారం ఉదయం స్థానిక 11వార్డుకు చెందిన కట్టేపోగు సుధాకర్‌కు సయ్యద్ జబీన్ బైపాస్‌రోడ్‌లోని అల్ హబీబ్ హోటల్ వద్ద క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లారు. సమీపంలో పడి ఉన్న కుక్క పిల్ల శబ్దాలు రావడంతో, ముడుగుకొమ్మలలో పడి ఉన్న కుక్కను చూసి, వాట్సప్ గ్రూపుల్లో ఉన్న మెసేజ్‌ను చూసి దాని యజమాని డాక్టర్ దాశరథికి సమాచారం అందించారు. అక్కడి చేరుకున్నఆయన , ఆయన కుమారులు కుక్కపిల్ల స్థితిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. వెంటనే టవల్‌తో దాని శుభ్రపరిచి, తన వాహనంలో తీసుకువెళ్లారు. ఆచూకీ తెలిపిన జబీన్ ఖాతాల్లోకి డాక్టర్ దాశరథి రూ.20వేలు పారితోషకం అందించారు. జబీన్ మాట్లాడుతూ దాశరథి ఇచ్చిన నగదుతో నోటు పుస్తకాలను కొనుగోలు చేసి, తన వార్డులోని పేద విద్యార్థులకు అందిస్తానని పేర్కొన్నారు.



కుక్కపిల్లకు సపర్యలు చేస్తున్న దాశరథి



ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీస్తున్న సిబ్బంది

## శివారు పొలాలకు సాగు నీరందించాలి

పెదపారుపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చివరి పొలాల వరకు సాగునీరు అందించాలని పెదపారుపూడి నీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారాయణ అన్నారు. వెంట్రప్రగడ సౌత్ చానల్‌లో సాగునీరు వానపాముల, జమిదింటకుర్రు, పెదపారుపూడి, జేతవరం పొలాలు సాగు చేయటానికి పై నుంచి కాలువ ద్వారా వస్తున్న నీరు దిగువకు సునాయాసంగా ప్రవహించటానికి సౌత్ చానల్ పూడికతీత పనులు చేస్తున్నట్లు తెలిపారు.

# జీతాల్లేక అల్లాడుతున్న అర్చకులు

పమిడిముక్కల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మంటాడ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో అర్చకులకు నెలల తరబడి జీతాలు లేక ఇబ్బంది పడుతూ జీతాలు ఇచ్చేవారు కరుణ చూపించండి స్వామీ అని భగవంతుని వేడుకుంటున్నారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మంటాడ వెంకటేశ్వరస్వామి రెండు ఆలయాల్లో నలుగురు అర్చకులు ఎంతోకాలంగా పూజ, దూపదీప నైవేద్యాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో బాధలు పడుతూ జీతాలివ్వండి మహాప్రభో అని వేడుకుంటూ ఎవరు చూస్తూ కాలం గడుపుతున్నారు. ఆలయ గత అధికారి నిర్వాహం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని, జీతాలివ్వేందుకు డబ్బులేని పరిస్థితి దాపురించిందని వారు వాపోతున్నారు. ఆలయానికి ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమానికి వంటచేసే వారికి సైతం జీతాలు ఇవ్వలేకపోవడం బాధాకరమని అర్చకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### నిధుల లేమి వల్ల జీతాలు ఆలస్యం

నిధులు లేకపోవడం వల్లే అర్చకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని ఆలయ ఈఓ పరిధిలోకి వస్తున్న ఇన్‌చార్జి అధికారి హరిదుర్గానాగేశ్వరరావు వివరణ ఇచ్చారు. స్వామివారికి వచ్చే కానుకలు,హుండీ ఆదాయం, పూజాది కార్యక్రమాలకు భక్తులు చెల్లించే డబ్బు తప్ప ఆలయానికి వేరే ఆదాయం లేదని, వచ్చిన ఆదాయం నుంచి జీతాలు ఇతర ఖర్చులు చెల్లిస్తుంటామని తెలిపారు.



శిలాఫలకం ప్రారంభిస్తున్న రామారావు

## వరద నివారణ పథకం పనులు ప్రారంభం

పెదపారుపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మోపర్రులో వరద నివారణ పథకం పనులు సీతయ్య రాజు రామారావు ప్రారంభించారు. వన్నేరు బుడమేరు డ్రైయిన్ మోపర్రు, ఇంజనంపాడు చేపల చెరువుల రైతులు , ఎస్‌ఆర్‌ఎ వారి సహకారంతో పథకం పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జూపల్లి శాఖ కమలకుమారి, డీసీ ప్రెసిడెంట్ యార్లగడ్డ రవి, డీసీ వైస్ ప్రెసిడెంట్ ఉజ్జనేని చంద్రశేఖర్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉజ్జనేని అనిల్, ఉజ్జనేని విశ్వేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా అండర్‌పాస్ రహదారి

పమిడిముక్కల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై అండర్ పాస్‌ల వద్ద గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రహదారిలో తాడంకి అండర్‌పాస్‌లో పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గురజాడ, తాడంకి, కురుమద్దాలి వద్ద అండర్‌పాస్‌లలో, ఇరువైపులా ఉన్న గుంతల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు పడి గాయాల పాలవుతున్నారు. మండలంలోని మర్రివాడ, గోపు వానిపాలెంతో పాటు పొరుగు మండలాల గ్రామాల నుండి ఉయ్యూరు వైపు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలపై తాడంకి అండర్ పాస్ నుండి వెళ్లవలసిన ఉన్న నేపథ్యంలో వర్షం కురిసినప్పుడు అండర్‌పాస్‌ ఎల్లో నీరు నిలిచి గుంతలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి అండర్‌పాస్‌లు, పక్కన ఉన్న సర్వీసు రోడ్లలోని గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



తాడంకి అండర్‌పాస్‌లో ప్రమాదకరంగా గుంతలు

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 102, 110, 121 |
| చికెన్ విత్ స్కిన్ | 194 |
| చికెన్ స్కిన్‌లెస్ | 204 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## హజ్ యాత్రికులకు సబ్సిడీ విడుదల చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర హజ్ యాత్రీకులకు సబ్సిడీ విడుదల చేయాలని ప్రముఖ న్యాయవాది, హాజీ ఎండి రఫీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు సద్రుద్దీన్ ఖురేషి డిమాండ్ చేశారు. బందరులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. 2023-24లో హజ్ యాత్ర చేసిన వారికి ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేయాల్సి ఉందన్నారు. 2024-25 హజ్ యాత్ర పూర్తి చేసుకుని దిగ్విజయంగా వచ్చిన హాజీలకు ప్రభుత్వం సబ్సిడీ ఇంకా విడుదల చేయలేదన్నారు. ముస్లిం సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.



స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట నరసింహారావును సత్కరిస్తున్న న్యాయవాదులు

## ప్రాసిక్యూషన్‌కు మంచి పేరు తీసుకువస్తా

### స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట నరసింహారావు

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రాసిక్యూషన్‌కు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదివాడ వెంకట నరసింహారావు అన్నారు. జిల్లా కోర్టులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాదివాడ వెంకట నరసింహారావును పలువురు న్యాయవాదులు, కొనకళ్ల రాధాకృష్ణ, టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్, గంజాల రవికుమార్, బత్తిన అగస్తేశ్వరరావు, కాళీపట్నపు రఘు, ఇంజనీర్ మురళీకృష్ణ, గట్టు కోటేశ్వరరావు, కోమటి వెంకటేశ్వరరావు తదితరులు ఘనంగా సత్కరించారు.



స్థూలకాయం సమస్యలపై మాట్లాడుతున్న న్యూట్రీషనిస్టు జి.చందన

## ఎక్కువ బరువు తగ్గినా అనర్థమే!

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : శరీర బరువు మరింత తగ్గినా అనర్థమేనని ప్రముఖ న్యూట్రీషనిస్టు జి. చందన అన్నారు. ఉదయపు నడక మిత్ర మండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో చందన మాట్లాడారు. స్థూలకాయం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ అధిక బరువు, లావు, పొట్ట, కొవ్వు సులభంగా తగ్గించుకునే మార్గాలను వివరించారు. ఉదయపు నడక మిత్ర మండలి అధ్యక్షుడు జల్లు మురళీనాథ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కార్యదర్శి ఘంటసాల రాము, కోశాధికారి వి. లక్ష్మినరసింహం, జోన్‌చైర్‌పర్సన్ కారుమూరి రాజేంద్రప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, కార్యదర్శి విన్నకోట సత్యవతి, టీఆర్‌కె గుప్తా, ఏఆర్‌కె బాబూరావు, అర్జా నరసింహారావు, వై.జగన్‌మోహనరావు, పెసల వెంకటేశ్వరరావు, పి. మధుసూదనరావు, మాటూరి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



హేమంత్, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రతినిధులు

## హేమంత్‌కు ఎన్టీఆర్ కళాపరిషత్ సన్మానం

చల్లపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సీఎంఏలో జాతీయస్థాయిలో 36వ ర్యాంకు సాధించి న్యూఢిల్లీ పతకం, ప్రశంసాపత్రం అందుకున్న వేముల హేమంత్‌ను, తల్లిదండ్రులు పాండురంగారావు..దీపికలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు బోలెం రామారావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఎన్టీఆర్ పార్కులో విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు నూకల లక్ష్మయ్య, కైతేపల్లి దాస్, రావెళ్ల ఉదయ్‌కుమార్, కొల్లిపర మధు, బుల్లా కిషోర్, ఉప్పల సాంబశివరావు, శంకరరావు, కోడూరు వెంకటేశ్వరరావు, ముమ్మనేని సన్నీ, షణ్ముఖ శ్రీనివాస్, కళాపరిషత్ సభ్యులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం



మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమాలు, పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి షౌకత్ హుస్సేన్ అన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సి ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. పీఎఫ్ రుణాలు అందించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి కనకారావు, ఎస్ ప్రభాకరరావు, ఝాన్సీ, మరీదు వరప్రసాద్, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.



ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే పక్కకు తప్పుకోవడానికి వీలులేని నడకుదురు రోడ్డు



రోడ్డు మార్జిన్‌లో పెద్ద పెద్ద గోతులు

# డబుల్ లైన్‌గా నడకుదురు రోడ్డు అవశ్యం

● వాహన రద్దీ ఎక్కువ ● గతంలో టీడీపీ ప్రభుత్వంలో రూ.5 కోట్లు మంజూరు ● వైసీపీ ప్రభుత్వం రాగానే రద్దు చేసిన వైనం

(ఆంధ్రజ్యోతి - చల్లపల్లి)

చల్లపల్లి - నడకుదురు రోడ్డు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆర్ అండ్ బి రహదారి. కరకట్ట మీదుగా విజయవాడ వెళ్లే ప్రయాణికులు ప్రధానంగా ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తూ ఉంటారు. అవనిగడ్డ - విజయవాడ కరకట్ట బస్సులు సైతం చల్లపల్లి మీదుగా ఈ రహదారిపైనే వెళుతుంటాయి. ఇసుక టిప్పర్లకు సైతం ఇదే ప్రధాన రహదారి. వీటికితోడు ఆయా గ్రామాల నుంచి నిత్యం చల్లపల్లి రాకపోకలు సాగించే వారితో ఈ రహదారి అత్యంత రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారి సింగిల్ లైన్‌గా ఉండగా, రహదారి ప్రాధాన్యతను గుర్తించి నవ్యాంధ్ర తొలి టీడీపీ ప్రభుత్వంలో నాటి ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ డబుల్ లైన్ రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ప్రభుత్వ మంజూరు చేసిన నిధులను కలంపోటుతో రద్దుచేసింది. ఫలితంగా ఐదేళ్లు గడిచినా డబుల్ లైన్ రహదారి వేయలేని పరిస్థితి నెలకొంది. రహదారి దెబ్బతినటంతో గత ప్రభుత్వ హయాంలో సింగిల్ లైన్ నిర్మాణం చేపట్టినప్పటికీ డబుల్ లైన్ కోసం నిధులు మంజూరు చేయలేదు. చల్లపల్లి పొలిమేర నుంచి నాలుగు కిలోమీటర్ల మేర డబుల్ లైన్ రహదారిని నిర్మించాల్సి ఉంది. ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వస్తే అవి రెండూ మార్జిన్ దిగాల్సిన పరిస్థితి ఉంటుంది. రహదారికి పలుచోట్ల మార్జిన్‌లు దెబ్బతినటంతో పక్కకు దిగాలన్నా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్టీసీ బస్సులకు తోడు ఇసుక టిప్పర్‌లు, లారీలు, ట్రాక్టర్లు, కార్లు, ఆటో లు, ద్విచక్ర వాహనాలతో రహదారి రద్దీగా ఉంటుంది. ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులు సైతం మార్జిన్ దిగాల్సి రావటం, ప్రమాదకరంగా మారటంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మార్జిన్లు పూర్తిగా దెబ్బతిని రాత్రివేళ ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది. వైసీపీ ప్రభుత్వం నిధులను రద్దు చేయకుంటే ఈపాటికి డబుల్ లైన్ నిర్మాణం పూర్తయి ఉండేదని ప్రజలు వాపోతున్నారు. డబుల్ లైన్ రహదారి ఆవశ్యకతను కూటమి ప్రభుత్వం గుర్తించి మరోసారి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



కోడూరు గంగానమ్మకు ఆషాఢ సారె తీసుకెళ్తున్న భక్తులు

# సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రూ.9.53 లక్షల ఆదాయం

మోపిదేవి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం ప్రత్యేకత కావటంతో అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టారు. స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు రావటంతో వివిధ సేవా రుసుముల ద్వారా రూ. 9,53,678 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సూర్యాపేటకు చెందిన దారం శిరీష వాటర్ కూలర్‌ను బహూకరించారు. ఆమె ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. వాటర్ కూలర్‌ను ఆలయ సహాయక ఉద్యోగి టి.రామకృష్ణకు అందజేశారు.



## వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం రాత్రి వారాహి అమ్మవారిని స్తుతిస్తూ 108 మంది మహిళలు కంద దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్ పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో మహిళలు భక్తిగీతాలను గానం చేశారు. ఆలయం దీపాలతో కళకళలాడింది.**నాగాయలంక** : కృష్ణానదీ తీరంలో కొలువై ఉన్న కనకదుర్గాదేవి ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో వారాహి నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం నాలుగో రోజు ఉన్మత్తవారాహి గా అమ్మవారు దర్శనమిచ్చారు. అర్చకులు ముదునూరి శ్రీనివాస శాస్త్రి, అచ్యుత శేఖర శర్మ బ్రహ్మత్వంలో వారాహి మాత ఉత్సవమూర్తికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## కోడూరు గంగానమ్మకు ఆషాఢ సారె సమర్పణ

కోడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో కొలువై ఉన్న గంగానమ్మ అమ్మ వారికి యర్రారెడ్డిపాలెం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, మురళీ కోలాట నృత్యాల నడుమ యర్రారెడ్డిపాలెం రామాలయం వద్ద నుంచి భారీ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, చలిమిడి, చీర, జాకెట్‌ను అమ్మ వారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీనివాస శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కూటమి నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పెడన పైడమ్మకు ఆషాఢ సారె

పెడన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం గ్రామదేవత పైడమ్మతల్లికి ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు బస్టాండ్ సెంటర్‌లో గల క్షిప్రసిద్ధి గణపతి ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి కొత్తపేటలోని పైడమ్మతల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. హిందూ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు పర్యవేక్షించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు మహిళలకు సాదర స్వాగతం పలికారు.

## సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం పాకలపాటి రాము బ్రహ్మత్వంలో నిర్వహించారు. వేకనూరు గ్రామానికి చెందిన మాదివాడ గోపి కృష్ణ - ధనలక్ష్మీ దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం జరిపించారు. గోపి కృష్ణ దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



## కోటి అష్టాక్షరి మహాయజ్ఞం నిర్వహిస్తాం

కోడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపాలెంలోని గోదా రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆయలంలో కోటి అష్టాక్షరి మహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామిజీ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మహాయజ్ఞం నిర్వహణపై వివిధ వర్గాల ప్రముఖులతో స్వామిజీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 13 రోజల పాటు మహాయజ్ఞం నిర్వహించేందుకు పండితులు ముహూర్తం నిర్ణయించినట్లు స్వామిజీ చెప్పారు. యజ్ఞాలకు 12000 కేజీల ఆవు నెయ్యిని వినియోగించటంతోపాటు ప్రతిరోజూ కోటిసార్లు అష్టాక్షరిమంత్రాన్ని జపించనున్నట్లు స్వామిజీ తెలిపారు.



## మాకర్ల వెంకటస్వామి నాయుడు దాతృత్వం అభినందనీయం

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నడిబొడ్డున ప్రధాన పార్కుకు స్థలాన్ని దానం చేసిన మాకర్ల వెంకటస్వామి నాయుడు దాతృత్వం అభినందనీయమని విగ్రహ కమిటీ ప్రతినిధి పిల్లారిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మునిసిపల్ ప్రధాన పార్కులోని మాకర్ల వెంకట స్వామినాయుడు విగ్రహానికి ఆదివారం పిల్లారిశెట్టి శ్రీనివాసరావుతో పాటు విగ్రహ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్కులో పనిచేస్తున్న కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. పిల్లారిశెట్టి సత్యనారాయణ, పరిమి పాండురంగ అప్పలస్వామి, మరకాని వాసు, మాదిరెడ్డి ఆంజనేయులు, మాదిరెడ్డి ఈశ్వర్, అయినాల నాగరమేష్, కుసుమహరనాథ్ పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదు : జనసేన

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జనసేన వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డికి లేదని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు ధ్వజమెత్తారు. జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రైతులకు రూ. 30 కోట్ల తన సొంత నిధులను అందించిన రైతుబాంధవుడు పవన్‌కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్‌ఛార్జిగా పేద ప్రజల కోసం తాను సంపాదించిన రూ. 6 కోట్లు బండి రామకృష్ణ వెచ్చించారన్నారు. బండి రామకృష్ణ జీవితం తెరిచిన పుస్తకమన్నారు. బండి రామకృష్ణ గురించి ఎవరైనా విమర్శిస్తే సహించేది లేదన్నారు.



## కాగిత వెంకట్రావు స్మారక వైద్యశిబిరం

బంటుమిల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కాగిత వెంకట్రావు జ్ఞాపకార్థం ఆదివారం నాగన్న చెరవు పంచాయతీ నెహ్రూ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. మునిపల్లి రాజారత్నం, మణిక్యమ్మ, సుందరరావు, అన్నమ్మ మెమోరియల్ ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ మధుసూదనరావు ఇతర వైద్య బృందం పాల్గొని జనరల్ ఫిజీషియన్, గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, చర్మవ్యాధులు తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వీరబాబు, నాగన్న చెరువు సర్పంచ్ అరుణకుమారి, మల్లంపూడి సర్పంచ్ రేవు గోపాలకృష్ణ, వైద్య బృందం పాల్గొన్నారు.

## బాల సంస్కార కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచి విద్యార్థులకు మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి అలవాటు చేసేందుకు, భగవద్గీత వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు పారాయణ చేసేందుకు మచిలీపట్నంలో ఐదు ప్రాంతాల్లో బాల సంస్కార కేంద్రాలు ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రభారి పి.వి.ఎస్. నాయుడు అన్నారు. మచిలీపట్నం కన్యకా పరమేశ్వరీ సత్రంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. పి.వి.ఎస్. నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో గో రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణకు సత్సంగాలను ఏర్పాటు చేయాలన్నారు. సుబ్బరాజు, దుర్గాప్రసాద్, వర్రె రాజశేఖర్, అల్లూరి కాంతారావు, కోట శ్రీకాంత్, చిట్టికుమారి, లక్ష్మీకాంతం, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, తురగా ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

## వైఎస్ షర్మిలకు ఘనస్వాగతం



పెడన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలకు ఆదివారం పెడనలో ఘన స్వాగతం లభించింది. భీమవరం నుంచి మచిలీపట్నం వెళ్తున్న షర్మిలకు తోటమూల సెంటర్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శాంతి నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

## షర్మిలకు శర్మ వినతి

మచిలీపట్నం టౌన్ : భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి కృషి చేయాలని సంఘ సేవకుడు పిఎస్ఎస్ఆర్ శర్మ ఆదివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.